క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

అవార్డుల పంపిణీ..

అదేవిధంగా వివిధ అంశాలపై గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న జీపీలకు ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డుల ప్రదానం చేయనున్నామని, ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారని ఇన్‌చార్జి ఎంపీడీఓ తెలిపారు.

యాచారంలో..

యాచారం: పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం నేడు (సోమవారం) సంఘం కార్యాలయంలో జరుగుతుందని ఆదివారం సీఈఓ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చైర్మన్ రాజేందర్ రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి డైరెక్టర్లతో పాటు, అన్ని గ్రామాల రైతులు పాల్గొనాలని ఆయన చెప్పారు.

ఘనంగా పెద్దమ్మకు బోనాలు



పెద్దమ్మ బోనాల ఊరేగింపు

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద గ్రామంలో ముదిరాజుల ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమ్మ బోనాలు ఘనంగా జరిగాయి. ఉత్సవంలో భాగంగా పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. బోనాల ఊరేగింపు అనంతరం ముదిరాజులు పెద్దమ్మ సన్నిధికి చేరి ఆమెకు నైవేద్యం సమర్పించారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



టోర్నీని ప్రారంభిస్తున్న జగదీశ్వర్ రెడ్డి

పహాడీషరీఫ్: క్రికెట్ పోటీలతో యువతలో ఐక్యతా భావం పెంపొందుతుందని మామిడిపల్లి బాల మణికంఠ అయ్యప్ప దేవస్థానం ధర్మకర్త మద్ది జగదీశ్వర్ రెడ్డి గురుస్వామి అన్నారు. బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మామిడిపల్లి ప్రీమియర్ లీగ్(ఎంపీఎల్)-7 క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. 45 రోజుల పాటు సాగే ఈ పోటీల్లో మొత్తం ఏడు జట్లు పాల్గొననున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, గ్రామ నాయకులు ఎడ్ల వాసుదేవరెడ్డి, లాల్ సతీష్ గౌడ్, రఘువీర్ రెడ్డి, జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



హోమం నిర్వహిస్తున్న పురోహితులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం భక్తి శ్రద్ధల నడుమ వైభవంగా జరిగింది. శనివారం రాత్రి జల్‌పల్లి కార్గో రోడ్డులోని ముత్యాలమ్మ దేవాలయం నుంచి వందలాది మంది భక్తజన సందోహం మధ్య విగ్రహాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. ఆదివారం మండపారాధన, స్వామి వారి విగ్రహాలకు అభిషేకం, దాన్యాధివాసం, మండపారాధన, హోమం తదితర పూజా కార్యక్రమాలు కొనసాగాయి. సోమవారం (నేడు) విగ్రహ ప్రతిష్ఠాపన జరగనుంది.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో లబ్ధి

బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్



ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభిస్తున్న శివకుమార్

తుక్కుగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తుక్కుగూడ మున్సిపాలిటీ బీజేపీ ఫ్లోర్ లీడర్ శివకుమార్ చెప్పారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల 4వ వార్డులో ఆయుష్మాన్ భారత్ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆయుష్మాన్ పథకంలో చేరిన ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఉచిత బీమా సౌకర్యం ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ ఉప్పు నూతల యాదయ్య, వెంకటాచారి, రవీందర్, కుమార్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ ఎజెండా

- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- గులాబీ శ్రేణుల సమీక్షలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- ఆత్మీయ సమ్మేళనం తేదీలు ఖరారు చేసిన ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: ప్రజా సంక్షేమమే బీఆర్‌ఎస్ పార్టీ ఎజెండా అని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఈ నెల 28న మండల కేంద్రంలోని ఎంబీఏ గార్డెన్‌లో నిర్వహించనున్న పార్టీ ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఆదివారం జెడ్పీటీసీ దశరథ్ నాయక్ నివాసంలో నిర్వహించిన సమావేశంలో పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ బలోపేతం, ప్రజా సంక్షేమానికి పాటుపడుతూ.. వచ్చే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా గులాబీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు గడపగడపకూ అందుతున్నాయని, ఇవి ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త, నాయకుడిపై ఉందన్నారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న తెలంగాణ ప్రభుత్వం వైపు దేశం మొత్తం చూస్తోందని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయని గుర్తు చేశారు. పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా ఉంటూ ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పి కొట్టాలని చెప్పారు.

ఆత్మీయ సమ్మేళనాలు..

కల్వకుర్తి నియోజకవర్గంలో 17 ముఖ్య కేంద్రాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ చెప్పారు. ఈ నెల 28న కడ్తాల్, ఏప్రిల్ 3న ఆమనగల్లు, 5న ముద్విన్, 7న ఆర్కపల్లి, 12న చుక్కాపూర్, 16న గట్టిప్పలపల్లి, 19న మాడ్గుల్, 21న ఇర్విన్, 22న వెల్జాల్‌లో సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 28న మండల కేంద్రంలో నిర్వహించే సమ్మేళనానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కంబాల పరమేశ్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, భారతమ్మ, నర్సింహగౌడ్, రైతుబంధు మండల అధ్యక్షుడు వీరయ్య, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్‌నాయక్, రమేశ్, మార్కెట్ డైరెక్టర్ నర్సింహగౌడ్, నాయకులు బాలకృష్ణ, ఇర్షాద్, రాజేందర్‌యాదవ్, నర్సింహ, రమణ ఉన్నారు.

కల్వకుర్తిలో వైఎస్‌ఆర్‌టీపీ జెండా ఎగురవేస్తాం

పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి వైఎస్‌ఆర్‌టీపీ కండువాలు కప్పుతున్న అర్జున్‌రెడ్డి

కడ్తాల్: ప్రజల ఆశీర్వాదంతో కల్వకుర్తి నియోజకవర్గంలో వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి అన్నారు. ఆదివారం కడ్తాల్ మండలం గానుగుమార్లతండా పంచాయతీ పరిధిలోని కానుగుబావితండాకు చెందిన శంకర్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన పలువురు వైఎస్‌ఆర్‌టీపీలో చేరగా.. వారికి అర్జున్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంపై తమ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని పలువురు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలో పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని చెప్పారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ.. కల్వకుర్తిలో పార్టీ జెండా ఎగుర వేయడమే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్‌గౌడ్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు బాలగోని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

హయత్‌నగర్: పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీలోని హనుమాన్‌నగర్ అభయాంజనేయ స్వామి ఆలయ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంచర్ల విజయభాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సీహెచ్. మురళీకృష్ణ, ఎం.దేవేందర్ రావు, మేకల అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కండగట్ల రమేష్, కోశాధికారిగా ఎస్.జగన్ మోహన్‌రెడ్డి. కార్యనిర్వాహక కార్యదర్శిగా ఢిల్లీ సంపత్‌రెడ్డి, ఉప కార్యదర్శిగా శ్రీధర్, గణేశ్ ఎన్నికవగా సలహాదారులుగా వెంకట కృష్ణారెడ్డి, సీహెచ్.నర్సయ్య, కంచర్ల లలిత, రావుల వాసుదేవరెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక సభ్యుడిగా భానుచందర్, రామ, స్వర్ణలత, శ్రీలత, స్వాతి, ప్రణతి, శివకేశవాచారి, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు.

ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించండి

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మాల కమ్యూనిటీకి సంబంధించి ఆత్మగౌరవ భవనం కోసం స్థలాన్ని కేటాయించాలని ఆదివారం కులపెద్దలు మీర్‌పేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సబితారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో మాల కులస్తుల జనాభా సుమారు 16వేలు ఉందని, విద్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహకారం అందేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఆత్మగౌరవ భవనం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించడంతో పాటు భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని వారు మంత్రికి విన్నవించారు. మంత్రి స్పందిస్తూ త్వరలోనే స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గజ్జెల రాంచందర్, చెవ్వ శ్రావణ్, ప్రభాకర్, సుదర్శన్, యాదగిరి, ఆవుల జనార్దన్, రాజలింగం, నర్సింగ్‌రావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ లీగల్ సెల్ కమిటీ నియామకం

కందుకూరు: బీఆర్‌ఎస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం లీగల్‌సెల్ విభాగం అధ్యక్షుడిగా కందుకూరు మండలం జైత్వారానికి చెందిన బైరు జగన్మోహన్‌రెడ్డి, సెల్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆదివారం వారికి మంత్రి సబితారెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఉపాధ్యక్షులుగా అశోక్, శ్రీనాథ్, జనరల్ సెక్రటరీగా శివకుమార్, జాయింట్ సెక్రటరీగా సంతోష్‌కుమార్, ట్రెజరర్‌గా నళిని, కార్యవర్గ సభ్యులుగా ఉమాచంద్రశేఖర్, నవీన్‌రెడ్డి, పావని, మల్లేశ్, యోగేష్‌కు నియామక పత్రాలు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ లీగల్ సమస్యలపై పోరాటం చేయాలని ఈ సందర్భంగా వారికి సూచించారు.

మద్యపాన నిషేధానికి కృషి చేద్దాం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఇబ్రహీంపట్నం రూరల్: మద్యపాన నిషేధానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఈ మేరకు ఆదివారం పోల్కంపల్లిలో జాతీయ సేవా సంఘం(ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేసి, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛభారత్ కార్యక్రమంలో డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొన్నాలని, విద్యతో పాటు సామాజిక సేవలు అలవాటు చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో చదువు రాక అజ్ఞానులుగా అనేక మంది మిగిలిపోతున్నారని, వారికి అక్షరాలు నేర్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని చెప్పారు. మద్యానికి బానిసై అనేక మంది చనిపోతున్నారని, వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని తెలిపారు. ఈ నెల 30 వరకు ఇక్కడ శిబిరం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగోజీ, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ మల్లిఖార్జున్, శ్రీను, ప్రకాష్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఉప గవర్నర్ ఎన్నిక



డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కందుకూరు: లయన్స్‌క్లబ్ జిల్లా 320ఏ రెండో ఉప గవర్నర్‌గా ప్రముఖ వైద్యుడు, లయన్స్‌క్లబ్ కందుకూరు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరిగిన 320ఏ జిల్లా ఏడవ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన ఎన్నికల్లో ఆయన్ను ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా.. డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి కందుకూరు మండలంలో ఉచిత మధుమేహ నిర్ధారణ పరీక్షలు, రక్తదాన శిబిరాలు, కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమున్న వారికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించినట్లు స్థానికులు తెలిపారు. కార్యక్రమంలో కందుకూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు బీఆర్ రాంరెడ్డి, రీజియన్ చైర్మన్ అంజయ్య, జోన్ చైర్మన్ రాంరెడ్డి, సెక్రటరీ జగదీశ్వర్‌రెడ్డి, ట్రెజరర్ చెన్నకిషన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు అమరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ జంగారెడ్డి, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, కేశవరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, వెంకట్‌రంగారెడ్డి, కృష్ణరామ్ భూపాల్‌రెడ్డి, సభ్యులు డాక్టర్ సుగుణాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, అంజిరెడ్డి, వెంకటేశ్‌గుప్తా, రామస్‌బాబు, లచ్చయ్య తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక అంశాలపై చైతన్య ర్యాలీ

ఇబ్రహీంపట్నం: సామాజిక అంశాలపై ప్రజలను చైతన్య పరిచేందుకు ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపు ఆదివారం ఆరుట్లలో ప్రారంభించారు. సిటీ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులు గ్రామంలో మద్యపానం, మహిళల అక్షరాస్యతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. సామాజిక అంశాలపై సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యపరిచారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నాగరాజు, చంద్రకీర్తి, సుదక్షన, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

- ప్రగతి నివేదనతో రెట్టింపు ఉత్సాహం
- ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రశాంత్‌రెడ్డి



పాదయాత్రలో మహిళతో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి(ఫైల్)

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ శ్రేణుల్లో 'ప్రగతి నివేదన' యాత్ర జోష్ నింపింది. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి జనవరి 22న యాచారం మండలం నందివనపర్తి నుంచి ఈ పాదయాత్రను ప్రారంభించారు. అలుపెరగకుండా 63 రోజుల పాటు సాగిన ఈ యాత్ర.. నియోజకవర్గంలోని యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లో, ఆదిభట్ల, ఇబ్రహీంపట్నం, పెద్ద అంబర్‌పేట, తుర్కయంజాల్ మున్సిపాలిటీల్లో సుమారు 95 గ్రామాల్లో పర్యటించారు. యాత్ర 775 కిలో మీర కొనసాగింది.

అందరితో మమేకమై..

అన్నివర్గాల ప్రజలను కలుపుకొంటూ ప్రశాంత్‌రెడ్డి యాత్రను కొనసాగించారు. కార్మికులు, కర్షకులు, మహిళల సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలను వారికి తెలియజేస్తూ, తన తండ్రి ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రశాంత్‌రెడ్డి తన యాత్ర కొనసాగించారు. బీఆర్‌ఎస్ యువజన విభాగం, బంటి యూత్ ఫోర్స్ సభ్యులు ప్రశాంత్‌రెడ్డికి వెన్నంటే ఉన్నారు.

ముగింపు సభ సక్సెస్..

పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ సర్కిల్ వద్ద శనివారం సాయంత్రం నిర్వహించిన పాదయాత్ర ముగింపు సభ విజయవంతం కావడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందోత్సవాలు వెల్లివిరిసాయి. ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రావడం మరింత బలాన్ని ఇచ్చింది. ఊహించిన దానికంటే ఎక్కువ సంఖ్యలో సభకు జనం హాజరుకావడం ప్రశాంత్‌రెడ్డి పాదయాత్రను వారు ఆమోదించినట్లేనన్న సంకేతాలు వెలువడ్డాయి. ఏదిఏమైనా ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి నియోజకవర్గానికి, అతనికి తిరుగులేదంటూ పలువురు పార్టీ శ్రేణులు చెప్పుకోవడం కొసమెరుపు.

4న హైదరాబాద్ దిగ్బంధం

ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కృష్ణ

కడ్తాల్: ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగా పిలుపు మేరకు ఏప్రిల్ 4న చేపట్టనున్న హైదరాబాద్ దిగ్బంధనాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్, పాదయాత్ర ఇన్‌చార్జి పోతుగంటి కృష్ణ పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా హైదరాబాద్ దిగ్బంధన సన్నాహక పాదయాత్ర ఎమ్మార్పీఎస్ మండల నాయకుడు మహేందర్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ, అబ్బురమేశ్ మాదిగ ఆధ్వర్యంలో మండలంలోని రావిచేడ్, న్యామతాపూర్, ముక్తమాధారం, సాలార్‌పూర్, చల్లంపల్లి, వంపుగూడ మీదుగా ఆదివారం మధ్యాహ్నం కడ్తాల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ సమస్య పరిష్కరిస్తామని, ఏబీసీడీలుగా వర్గీకరిస్తామని మాట ఇచ్చి తొమ్మిదేళ్లు గడిచినా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా మాదిగలను మోసం చేశారని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించాలని, లేని పక్షంలో బీజేపీకి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాంచంద్రయ్య, రాజుమాదిగ, నర్సింహ, శ్రీను, అంజి, శివ, శంకరయ్య, నర్సింహ, వినయ్, సైదులు, నిఖిల్, ప్రశాంత్ ఉన్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు

- రాహుల్‌పై అనర్హత వేటుకు నిరసనగా మోదీ దిష్టిబొమ్మ దహనం చేసిన కాంగ్రెస్ కార్యకర్తలు



మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

ఇబ్రహీంపట్నం: రాహుల్ గాంధీపై అనర్హత వేటుకు నిరసనగా.. పార్టీ పిలుపు మేరకు ప్రధానిమోదీ దిష్టిబొమ్మను మంచాల మండలం జాపాలలో కాంగ్రెస్ శ్రేణులు ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఏర్పుల రాజు మాట్లాడుతూ రాహుల్ సభ్యత్వాన్ని రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టన్నారు. దీన్ని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రతి కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సంజీవ, లింగమయ్య, సతీష్, సుమన్, రమేష్, వెంకటేశ్, లింగం, నాగరాజ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మేలు



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌యాదవ్

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదలకు ఎంతో మేలు చేస్తుందని మాజీ ఎంపీపీ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు సీఎల్. శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలకు చెందిన బాలమణికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ సహకారంతో సీఎం సహాయనిధి కింద రూ.56 వేలు, అయిల రాణికి రూ.18వేలు మంజూరయ్యాయి. ఈ మేరకు వెల్జాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో సీఎల్.. సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రైతు సమన్వయ సమితీ అధ్యక్షుడు నరేందర్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు శ్రీకాంత్‌యాదవ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, అంజి, పర్వతాలు యాదవ్, రాజు, రవి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన చిత్తాపూర్ గ్రామానికి చెందిన బాల్‌రాజ్‌కు సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.22 వేల చెక్కును సర్పంచ్ నాగరాజుగౌడ్ అందజేశారు. కార్యక్రమంలో పెద్దులు, శ్రీనివాస్, మల్లేశ్, కృష్ణ, నరసింహ, మహేందర్ పాల్గొన్నారు.

శాలివాహన సంఘం కమిటీ ఎన్నిక



కమిటీతో శాలివాహన సంఘం నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామ శాలివాహన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహేశ్వరం నియోజకవర్గం శాలివాహన సంఘం అధ్యక్షుడు ఎగిరిశెట్టి బాలయ్య, మండల అధ్యక్షుడు బొడ్డుపల్లి రవి ఆధ్వర్యంలో ఎన్నుకున్న కమిటీని ఆదివారం ప్రకటించారు. ఆ గ్రామ శాలివాహన సంఘం అధ్యక్షుడిగా జాపాల శివకుమార్, గౌరవాధ్యక్షుడిగా జాపాల శ్రీరాములు, యూత్ ప్రెసిడెంట్‌గా జాపాల జ్ఞానేశ్వర్, ఉపాధ్యక్షుడిగా జాపాల మహేందర్, జాపాల శ్రీనివాస్, జనరల్ సెక్రటరీలుగా జాపాల శివశంకర్, జాపాల కిషన్, కార్యదర్శులుగా జాపాల ప్రశాంత్, సురేష్, రవి, కోశాధికారిగా జాపాల దశరథ్, సభ్యులుగా జాపాల కుమార్, శ్రీకాంత్, వెంకటేష్, యాదయ్య, నరసింహ, పాండు, దానయ్యలను ఎన్నుకున్నామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల యూత్ ప్రెసిడెంట్ ఎగిరిశెట్టి నరేష్, వైస్ ప్రెసిడెంట్ సందీప్‌కుమార్, ఎగిరిశెట్టి వంశీధర్ పాల్గొన్నారు.

'బాలల హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత'

ఆమనగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని బాలల హక్కుల ప్రజాధ్వని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచుకట్ల సుభాష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత అని, రాష్ట్రంలో బాలల హక్కుల ఉల్లంఘన యథేచ్ఛగా జరుగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, పౌష్టికాహారం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని, వారికి పురుగులు పడిన భోజనం వడ్డిస్తున్నారని విమర్శించారు. నేటిబాలలే రేపటి పౌరులని, అలాంటి బాలలకు పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన చెప్పారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కమిషన్ జిల్లా ఆర్గనైజర్ కొమ్ము తిరుపతి, నాయకులు శ్రీశైలం, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు సంస్కారం నేర్చుకోవాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం కూడా నేర్చుకోవాలని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ జోన్ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి సూచించారు. ఆమనగల్లు పట్టణంలోని కల్యాణి గార్డెన్స్‌లో ఆదివారం ఆ పాఠశాల ఆధ్వర్యంలో తల్లిదండ్రుల పాదపూజ, సంస్కార వికాస సాధన, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తల్లిదండ్రుల పాదాలు కడిగి ఆశీర్వాదం తీసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీనివాస్, రవీంద్రానంద్, సుదర్శన్, ప్రిన్సిపాల్ విఠల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

– ఆమనగల్లు